మొన్నీ మధ్య ఊళ్ళో మూడురోజులపాటు ఒక విదేశీ జట్టుకీ మన దేశపు జట్టుకీ మధ్య క్రికెట్ మ్యాచ్ జరిగింది. ఆ సందర్భంగా కొన్ని అవాకులూ చెవాకులూ:

"ఫారిన్ వాళ్ల వస్తున్నారని రోడ్డు బాగు చేసేరు. స్టేడియం కంపుకొట్టకుండా శుద్ధి చేసేరు. అయినా నీలాంటి వీర క్రికెటాభిమాని వెళ్ళలేదే!"

"రోడ్డు బాగు చేసేరు, అంతా నిజమే కాని; వన్ వే ట్రాఫిక్ పెట్టేరుగా, స్టేడియంలో దుర్వాసన అంతా ఈ రోడ్డు మీదకి చేరిపోయింది."

★ ★ ★

కనీసం లక్షమందయినా వస్తారనుకున్నారట. కానీ ఆ మూడు రోజులూ కరెంటు పోలేదని అందరూ ఇళ్లల్లో ఉండిపోయి టీవీల్లో చూసేశారట మేచి మొత్తం.

ఇరవై వేల టిఫిన్ పొట్లాలూ, పదివేల డ్రింక్సు బాటిల్సూ (అమ్మకానికి) రప్పించేరట. అమ్మకాలు పదిశాతం కూడా చేరలేదట.

మూడో రోజు టి.వి.లో మేచ్ "ఇవ్వడం" లేదని తెలిసి సుమారొక మూడువేలమంది వచ్చేరట. "గేటు బైట సుమారు రెండు వందల మంది ఉన్నారు. వాళ్ల దగ్గర టికెట్లు లేవు. పోనీ గేటు తెరిచేద్దామా?" అని అడిగితే "ఒద్దు. గేటు తెరిస్తే లోపలున్న వాళ్లలో చాలామంది బైటికి వెళ్లిపోతారు. ఆట ఏమవుతుందో ముందే తెల్సిపోయింది!" అని జవాబు. ★

# 93. అనగనగా ఒక కుర్చీ

**బా**పుగారి కార్టూన్ ఒకటుంది. చాలామంది చూసే ఉంటారు గాని; చాలా గొప్ప కార్టూన్ కనకానూ, నాకు బొమ్మలు వెయ్యడం చేత కాకానూ; వాచ్యం చేయవలసి వస్తోంది. ఒకానొక ఆఫీసరు గారు తన ఆఫీసులో ఆ సీటూ ఈ సీటూ పరిశీలించి చూడ్డంలో పచారు చేస్తుండగా ఒక చోట ఆగి, ఒక టేబిల్ నిండా ఫైళ్ళు అంతెత్తున పేరుకుపోయి ఉండడం గమనించి ఇలా అన్నారు. "ఇవన్నీ క్లియర్ చెయ్యండి. దానికింద ఉండే గుమస్తాని డిస్మిస్ చెయ్యాలి గనక ప్రపోజల్ పెట్టండి".

నేను పని చేస్తూ ఉండిన ఆఫీసులో నా టేబిలు మీద ఫైళ్లు పేరుకుపోయినప్పుడల్లానూ అర్ధరాత్రి దాకానూ అపరాత్రి దాకానూ పనిచేసి డిస్మిస్ అయిపోకుండా నెట్టుకొస్తూ ఉండేవాణ్ణి.

అయితే ఒకసారి మా మేనేజరు గారికి దొరికిపోయాను. దానికి కారణం నేను కూర్చోవడానికి వేసిన అల్లకపు కుర్చీలో (చేరబడే బాగం కాక) కింద భాగం అల్లకంలో చిన్న చిరుగు ఏర్పడడం, ఆ చిరుగు పెద్దదై కూర్చోవడానికి ఇబ్బందవుతోందని అక్కడ ఒక 'అట్ట' పెట్టేను; అది నా బరువుకీ కుర్చీ అల్లకం చిరుగుకీ మధ్య నలిగిపోతే కొన్ని పనికిరాని కాగితాలూ పాత మేగజైన్లూ, అతిథులు వదిలేసిన వార్తా పత్రికలు వేసుకుంటూ ఆ కుర్చీకి మాన సంరక్షణ చేసేను. మా మేనేజరు గారు మా సెక్షనుకి పరిశీలనకి వచ్చినప్పుడు వారి గౌరవార్థం లేచి నిలబడకపోతే ఏమీ లేకపోయేదే. కాని, నేను నిలబడ్డం వల్ల బోలెడు గొడవైంది.

"ఏమిటా కుర్చీ అలావుంది? దాన్నిండా ఆ కాగితాలేమిటి? నువ్వు ఇలాగ వచ్చిన కాగితాలన్నీ ముడ్డి కింద వేసుక్కూర్చుంటే ఇంక నువ్వు పనేం చేస్తున్నట్టు?" అని గట్టిగా దబాయించి ఆ కాగితాలన్నీ తీయించేరు మా మేనేజరుగారు. అంతే. ఆయనతో బాటుగా నేనూ నిర్ఘాంతపోయాను.

కుర్చీ అల్లకం "చిరుగు" కాదు అది. మొత్తం అల్లకం అంతా ఏ వరస కావరస తెగిపోయి స్వర్గంలాంటి సీటు సొరంగంగా మారింది. నేల నుంచి మీది దాకా ఒకటే కాగితాల గుట్ట పోగుపడి నన్ను మోస్తోందని తేలింది.

"నువ్వు నా ఆఫీసులో పని చెయ్యడం షేమ్ కాదు గాని ఇలాంటి కుర్చీ నా ఆఫీసులో ఉండడం షేమ్ (సిగ్గుచేటు). వెంటనే ఈ కుర్చీని అల్లకానికి పంపించు." అన్నారు.

"చిత్తం. అల్లకానికి శాంక్షన్ లేదండి" అన్నాను.

"అసలు నువ్వు నోట్ పెట్టేవా?" అన్నారాయన.

"ఆయ్!" అని ఫైల్ తీసి చూపించేను. ఆయన నిలబడి వుండే అదంతా క్షణాల మీద చదివేశారు (ఆయన గొప్ప సూక్ష్మగ్రాహి) 1. అయ్యా, నా కుర్చీ చెడింది కనుక అల్లకం చేయించ ప్రార్థన (ఏప్రిల్ 4). 2. ఈ ఆర్థిక సంవత్సరానికి కుర్చీ సీట్ల అల్లకం కోసం కేటాయించిన బడ్జెటు అయిపోయింది కనుక త్రిప్పివేయడమైనది. (మెయింటెనెన్స్ సూపర్‌వైజర్, ఏప్రిల్ 10). 3. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కొత్త ఏలకేషన్ (కేటాయింపు) వస్తుంది కనుక అప్పుడు గుర్తు చేయవలెను (మా సెక్షన్ సూపరింటిండెంట్, ఏప్రిల్ 12). 4. కూర్చోవడానికి ఇబ్బందిగా ఉంది; కనుక పునఃపరిశీలించ ప్రార్థన. బడ్జెట్‌లో లేకపోయినా చిల్లర మల్లర పనులు (మిసలేనియస్ వర్క్స్) కింద ఈ చిన్న పనిని చేయించవచ్చునని తెలుస్తున్నది గనుక నివేదించడమైనది. (నేనే; ఏప్రిల్ 24). 5. "చిల్లర మల్లర పనులు"లో చేయించడానికి సావకాశం ఉంది కానీ ఇలాంటి వాటికి కూడా టెండర్లు పిలవాలని సర్క్యులర్ వుంది. టెండర్లు పిలిచే విషయంలో మేనేజరుగారి అనుమతి వుండాలి. ఆయన క్యాంప్‌లో ఉన్నారు గనుక పదిహేను రోజుల తరువాత పంపేది. (అసిస్టెంట్ మేనేజర్, ఏప్రిల్ 29). 6. మేనేజరు గారు క్యాంప్‌నుండి వచ్చేరని తెలుస్తున్నది గనుక ఫైలు పంపడమైనది (మే 16). 7. ఏదైనా ఒక పనికి టెండరు పిలిచేటపుడు అటువంటి పని ఇంకా ఎక్కడెక్కడ ఉందో సమగ్రమైన సమాచారం సేకరించి, మొత్తం ఎంత ఉందో రూఢి చేసుకోవాలి. ఈ ఒక్క కుర్చీకి అల్లకం చేయించేస్తే రేపు మరొకరు, మర్నాడు ఇంకొకరు, ఇలా అలా నోట్‌లు పెడతారు.

అప్పుడు అసలు పనికంటే ఈ నోట్‌లు చూసే పనే ఎక్కువైపోయి మేనేజరుగారికి తలనొప్పిగా తయారవుతుంది. (డిప్యూటీ మేనేజర్, జూన్ 12). సర్క్యులర్: అయ్యలారా, అమ్మలారా! ఇందు మూలముగా తెలియజేయడమేమనగా, మన ఆఫీసులో ఉన్న వేర్వేరు సెక్షనులలో ఎక్కడెక్కడ సీట్లూ వీపులూ చిరిగిపోయినటువంటి ప్లాస్టిక్ అల్లకపు కుర్చీలు ఉన్నా; వాటి నెంబర్లు ఆయా కుర్చీల ప్రస్తుతపు వాడకం దార్లూ చిరుగుయొక్క స్వభావం, పరిమాణం మొదలైన వివరాలు ఈ దిగువ సంతకం చేసినవారికి పదిహేను రోజులలోగా తెలిపేది. చిరిగిపోయిన సీట్లు, వీపులు - బడ్జెట్‌తో సంబంధం లేకుండా ప్రత్యేక పరిశీలన క్రింద అల్లకానికి

పంపించే ఉద్దేశంతో ఈ సర్క్యులర్‌ని రూపొందించడమైనదని గమనించ ప్రార్థన. పదిహేను రోజులలోగా ఏ సెక్షన్ నుంచి అయితే సమాధానం రాదో ఆ సెక్షన్‌లో అల్లకానికి పంపవలసిన కుర్చీలు లేవని భావించబడుతుంది. (నేను: జూన్ 4)

"ఎక్సలెంట్! గొప్పగా నడిపించేవు కథ! నీ బుర్రే బుర్ర! అని మేనేజరుగారు నన్ను మెచ్చుకున్నారు. "అన్ని సెక్షన్ల నుంచీ సమాధానాలు వచ్చేయా?" అని అడిగేరు.

"సర్క్యులర్ ఇష్యూ చేసిన పధ్నాలుగో రోజు సాయంకాలం నుంచీ కదా, జవాబులు వస్తాయి! అంతవరకూ ఇది అర్జంట్ అవదు సార్." అని చెప్పేను.

మేనేజరుగారు నా ఒక్క సీటు దగ్గిరా పది నిమిషాలు ఉండిపోవడం వల్ల నా పనీ ఆగిపోయింది; చోద్యం చూస్తున్న మా సెక్షన్ అంతా స్థంభించిపోయింది. అంతేకాక మేనేజరుగారి లాబీలో విజిటర్స్ సంఖ్య క్షణక్షణం పెరుగుతోంది. అంచేత ఆయన బయలు దేరేరు.

ఐతే, బయలుదేరిన మా మేనేజరుగారు ఓ క్షణంలో వెనక్కొచ్చి, ఒక ప్యూన్ని కేకేసి "ఈ కుర్చీ ఇక్కణ్ణించి తీసేసి స్టోర్‌లో పడెయ్యి. నా లాబీలో ఉన్న కుర్చీల్లో కాస్త మంచిది చూసి తెచ్చి ఇక్కడ వెయ్యి" అని ఆర్డర్ పాస్ చేసేరు.

ఆ తరవాత పదిహేను రోజులకి మొత్తం నలభై రెండు కుర్చీలు రిపేరుకి గాను అయిదు వందల నాలుగు రూపాయలు కూలి, మూడువందల ఇరవై రెండు రూపాయలకి ప్లాస్టిక్ త్రెడ్డు శాంక్షన్ అయ్యాయి.

ఏడ్చిన దాని మొగుడు ఒస్తే ఏడవని దాని మొగుడూ ఒచ్చేడన్నట్టుగా నా బాధ వల్ల ఎందరి బాధలో తీరి సాంఘిక ప్రయోజనంఏర్పడిందని నేను గర్వపడ్డాను. ★

# 94. స్వామి కార్యం

"**ను**వ్వు ఆఫీసుకి రాగానే ఓసారి వచ్చి తనకి కనిపించమన్నారు మన మేనేజరుగారు" అని అటెండెన్సు రిజిస్టరు నా ముందుకి తోశాడు మా సూపరింటెండెంటు.

రిజిస్టర్‌లో ఈ నెల పేజీలు పట్టుకుని అందులో నాపేరు ఉన్న పేజీ తెరిచి "ఏదైనా అర్జంటా?" అని అడిగాను.

"ఏమో నాకేం తెలుసు? ఆయన చెప్పమన్నారు; నేను చెప్పేను."

సంతకం పెడదామని నా పేరు ఎదురుగా ఉన్న లైన్‌లో ఈ రోజు గడిలో పెన్ మోపాను. అయితే అక్కడ ఎర్రసిరాతో ఒక కొశ్చన్ మార్కు పెట్టి ఉంది. రూల్ ప్రకారం అలా కొశ్చన్ మార్కు ఉంటే సంతకం పెట్టకూడదు. లేటుగా వచ్చాడా, సెలవుపెట్టాడా, అసలెక్కడ తగలడ్డాడు- ఇన్ని ప్రశ్నలు ఆ కొశ్చన్ మార్కులో ఉన్నాయి. సమాధానం మేనేజర్ గారికి చెప్పి మరీ సంతకం తగలెట్టాలి. ఆ సందర్భంలో చెప్పే కారణం వారికి సబబుగా తోచకపోతే రాత మూలకంగా పర్మిషన్ అడిగి, గ్రాంటు చేయించుకుని, వారి సమక్షంలో టైమ్ నోట్ చేసి సంతకం పెట్టాలి.